క్లుప్తంగా

21న స్వర్ణామృత ప్రాసనం పంపిణీ


శ్రీనాథ్‌గుప్తా

ఆదోని అర్బన్: ఈనెల 21న ఆదోని పట్టణం లోని అభయాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఆదోని అవోపా మరియు ఎస్ఆర్ఐ కాకు బాళ్ నగేష్ ఆధ్వర్యంలో 15వ విడత స్వర్ణామృత ప్రాసనం మందును పంపిణీ చేస్తున్నట్లు అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరు నెలల నుంచి 16 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు పుష్యమి నక్షత్రం రోజున (21-08-2025)న ఉదయం 7 గంటలకు అమూల్యమైన వెలకట్టలేని ఈ మందులను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ఔషధం రోగ నిరోధకశక్తి, మేధాశక్తి పెంపునకు, మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదం చేస్తుందన్నారు. 98494 78178 నంబర్‌కు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

కూలిన ఇంటి గోడ

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురుస్తున్న వర్షానికి తడిసిన ఓ ఇంటి గోడ కూలిపోయింది. గ్రామానికి చెందిన ఆరేకంటి పోతప్పకు చెందిన ఇంటి మట్టి గోడ వర్షానికి పూర్తిగా తడిసి కొంత భాగం పడిపోయింది. తర్వాత పై కప్పు నుంచి మట్టి క్రమంగా కిందపడి రాళ్లు పడ్డాయి. అయితే గోడ కూలే సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు.

ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట


పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వాల్మీకి విగ్రహప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఎంపీపీ గొల్లకేశన్న, కడిమెట్ల సర్పంచ్ పెద్దమారెప్ప హాజరయ్యారు. వాల్మీకి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పూలమాల వేశారు.

నివాళి


రామకృష్ణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని మంత్రాలయం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రామకృష్ణ అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్ రెడ్డి గ్రామానికి చేరుకుని రామకృష్ణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఆర్థిక సాయం అందజేసి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఎమ్మిగనూరురూరల్: వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిలో హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రోగులకు అందుబాటులో ఉండే విధంగా వందపడకల ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. వంద పండల ఆసుపత్రిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, పాత హస్పిటల్స్‌లో ఉన్న ఆపరేషన్స్‌కు సంబంధించిన పరికరాలను త్వరగా కొత్త గదుల్లోకి మార్చాలని సూచించారు. సమావేశంలో సూపరిండెంట్ డాక్టర్ సుధా, డాక్టర్లు, హెచ్‌డీసీ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్ అఫీషియో సభ్యుడిగా బి.టి.నాయుడు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్సీ బి.టి.నాయుడు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ ఎం.కృష్ణ ఆధ్వర్యంలో బి.టి. నాయుడు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదోనికి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.

దళిత వాడల అభివృద్ధి పట్టదా?

కౌతాళం: దళిత వాడలను అభివృద్ధి చేయరా అని సీపీఎం నాయకులు, ఆర్డీటీ కాలనీ కాలనీ వాసులు ప్రశ్నించారు. మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలోని ఆర్డీటీ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో కాలనీ వాసులు పెద్ద ఎత్తున తరలి వచ్చి తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దారు రజినీకాంత్‌రెడ్డికి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు మల్లయ్య, ఈరన్న, వీరేష్ పాల్గొన్నారు.


పూలచింతలో పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు


కోసిగిలో చాప ప్రవహిస్తుండడంతో నిలిచిన వాహనాలు.


బసదొడ్డిలో నీట మునిగిన వేరుశనగ పంటను చూపుతున్న రైతు


పెద్దకడబూరులో పత్తిపంటలో నిలిచిన వర్షపు నీరు

వీడని వర్షాలు.. దెబ్బతింటున్న పంటలు

- పత్తి, వేరుశనగ, ఉల్లి పంటలపై తీవ్ర ప్రభావం
- చేతికొచ్చిన పంట కోయలేని పరిస్థితి
- కోసిన పంటలు పొలంలోనే కుళ్లుతున్న వైనం
- ఆందోళనలో అన్నదాతలు

గోనెగండ్ల : బంగాళఖాతంలో ఏర్పడిన అల్పడిన ప్రభావంతో మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలతో మండల కేంద్రంతో పాటు గ్రామాలు చిత్తడిగా మారాయి. పది రోజులుగా ముసురు వీడడం లేదు. గత పదిరోజులుగా కురుస్తున్న వర్షాలు పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మండలంలో ఖరీఫ్ కింద పత్తి 10,172 హెక్టార్లు, ఉల్లి 910 హెక్టార్లు, వేరుశనగ 1970 హెక్టార్లలో పంటలను సాగు చేశారు. అధిక వర్షాలతో చేతికొచ్చిన వేరుశనగ, పత్తి, ఉల్లి, సజ్జ, కొర్ర తదితర పంటలు దెబ్బతింటున్నాయి. రోజూ వర్షం కురుస్తండటంతో తడిఆరాక చేతికొచ్చిన పంటలను కోద్దామనుకున్న రైతులకు అడ్డంగా మారింది. కొన్ని పంటలు రంగు మారి గింజలు దెబ్బతింటున్నాయి. అదేవిధంగా పత్తి పంట పూత కాయ నిలవడం లేదు. కంది, ఉల్లి, వేరుశనగ పంటలు వర్షాలకు ఎర్రగా మారి తెగుళ్ల బారీన పడుతున్నాయి. ఆకులు రాలిపోయి చెట్లు ఎర్రగా అవుతున్నాయి. వేరుశనగ పంటలు కోతలు పూర్తై పొలంలోనే ఉండగా వర్షాలు కురువడంతో కట్టె మొత్తం కుళ్లి నల్లగా మారుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గింజ కూడా దెబ్బతింటుందంటున్నారు. పత్తి, వేరుశనగ, ఉల్లి, సజ్జ, కొర్ర రైతులకు మాత్రం వర్షం తీవ్ర నష్టం చేకూర్చింది.

అధిక వర్షాలకు దెబ్బతింటున్న పంటలు

పెద్దకడబూరు: మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలో నరసింహులు అనే రైతు తనకున్న రెండున్నర ఎకరాలలో సాగుచేసుకున్న వేరుశనగ పంట కోసి ఆరబెట్టాడు. రోజూ కురుస్తున్న వర్షాలకు పంట నీట మునిగి దేనికీ పనికి రాకుండా పోయిందిన ఆ రైతు కంటతడి పెడుతున్నాడు. అదేవిధంగా మండల పరిధిలోని రాగిమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన కొంతమంది రైతులు ఉల్లిపంటను కోశారు. వర్షం రోజూ వస్తుండడంతో వాటిని పొలంలోనే అలాగే ఉంచారు. మండల పత్తి, మిరప, కూరగాయల పొలాల్లో వర్షపు నీరు నిలువ ఉండడంతో ఆ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముందస్తుగా వేసుకున్న పత్తి పొలంలో పత్తికాయ పాకానికి వచ్చి పగిలే సమయంలో ఇలా రోజూ వర్షం కురుస్తుండడంతో కాయ కుళ్లిపోవడం, రాలిపోవడం జరుగుతోంది. దీంతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిపోయింది.

కోసిగిలో కుండపోత వర్షం

కోసిగి: మండలంలో రెండు రోజులుగా కుండపోత వర్షం కురువడంతో రైతులు, ప్రజలు అల్లాడిపోతున్నారు. వర్షం రాకతో మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లితున్నాయి. కోసిగిలోని రైల్వే గేటు సమీపంలో చాప వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. అక్కడ రోడ్డు కోతకు గురికావడంతో వాహనాలు ఇరుక్కుపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పంటపోలాలు సైతం దెబ్బతిన్నాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కొల్మాన్‌పేట గ్రామ సమీపంలో ముందుగా సాగుచేసుకున్న ఉల్లి పంటను కోత కోసి గట్టు ఆరబెట్టారు. అంతలో వర్షం విడువ కుండా ఏకధాటి కురుస్తుడడంతో తడిసిపోయాయి. అలాగే మరొక రైతు వేరుశనగ పంట కోత కోసి పోలాల్లోనే ఆరబెట్టాడు. మరో రెండు రోజుల పాటు ఇలాగే వర్షం కురిస్తే చేతికొచ్చిన పంట చేతికందకుండా మొలకలు వచ్చే ప్రమాదం ఉందని రైతు వాపోతున్నారు.


కందుకూరులో వరి పొలాల్లోకి చేరిన తుంగభద్ర వరద నీరు


పూలచింతలో వర్షం తాకిడికి కొట్టుకుపోయిన మిరప పైరు

అన్నదాత బేజారు

నందవరం: మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. మండలంలో 37.8 మీ.మీటర్లు వర్షపాతం నమోదయింది. నందవరం మండలంలో 38 వేల ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. ప్రస్తుతం పత్తి పంటలు పూత, కాయ దశలో ఉంది. కురుస్తున్న వర్షాలకు మొక్కల పూత రాలిపోవడంతో పాటు కాయాలు నీరు చేరి కుళ్లిపోతుడడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరికొన్ని గ్రామాల్లో పంట పోలాల్లో వాన నీటి నిల్వతో పత్తి మొక్కలు ఎర్రగా మారిపోయి దెబ్బతింటున్నాయి. అలాగే ఈ వానలు భారీగా కురుస్తుడడంతో మిరప మొక్కలు కొట్టుకుపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఉప్పొంగి ప్రవహిస్తున్న తుంగభద్ర

హోస్పేట్ డ్యామ్ నుంచి తుంగభద్ర నదికి లక్షన్నర క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో పాటు కుండపోత వర్షం కురువడంతో నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కడదొడ్డి, లక్ష్మీనగర్ క్యాంప్, కందుకూరు, సాతనూరు, అగసనూరు, తుంబిగనూరు గ్రామాలోని నది తీర పొలాలలోకి వరద నీరు చేరుకున్నాయి. కదదొడ్డిలో మోటార్లు మునిపోయాయి.

ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి


ప్రజా సమస్యలను వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి చెందేలా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్)లో పాల్గొని డివిజన్‌లోని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి, డీఎల్‌పీఓ తిమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమావేశం

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2025లో భాగంగా సోమవారం రాజకీయ పార్టీల నాయకులు, సంబంధిత అధికారులతో సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆదోని నియోజకవర్గ ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రం హేతుబద్ధీకరణ, నూతన ఓటర్ నమోదు ఫారం, 6, 7, 8 సంబంధిత అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎన్నికల ఉప తహసీల్దార్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు తొలగించడం దారుణం


సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ వికలాంగుల సంఘం నాయకులు

ఆదోని రూరల్: అర్హులైన వారి పింఛన్లను తొలగించడం దారుణమని వికలాంగులు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వైఎస్సార్‌సీపీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు వాల్మీకి రామాంజనేయులు, ఆదోని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పి.హనుమంతరెడ్డి, విజేత మండలాధ్యక్షులు వై.దుగ్యప్ప, వీరాంజనేయులు పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులకు రీ అసెస్‌మెంట్ క్యాంపులో పెన్షన్‌లు తొలగించడం అన్యాయమన్నారు. పింఛన్లు జారీ చేసిన నోటీసులు కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకొని, పింఛన్లను పునఃరుద్ధరించాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వారు వినతి పత్రం అందించారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ

కోసిగి: మండల పరిధిలోని తుంగభద్ర నది ఒడ్డున వెలసిన శ్రీ రామలింగేశ్వర దేవాలయం నుంచి నది వరకు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సొంత నిధులు రూ20.లక్షలతో సీసీ రోడ్డు ఏర్పాటు చేయించినట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ తెలిపారు. సోమవారం గ్రామస్తులతో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా శ్రావణ మాసం చివరి సోమవారం ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం తుంగభద్ర నది చెంతకు చేరి.. ఒడ్డున ఏర్పాటు చేసిన కట్టపై ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా సాగుతోందన్నారు. స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులు నది వరకు రోడ్డు వసతిలేక తీవ్ర ఇబ్బందులు పడేవారని, గమనించిన గ్రామ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. ఆయన సానుకూలంగా స్పందించి రూ.20లక్షలు సొంత నిధులతో రామలింగేశ్వర ఆలయం నుంచి నది వరకు సీసీ రోడ్డు వేయించారని తెలిపారు. సోమవారం ఉదయం కుండపోత వర్షం కురిసినా సీసీ రోడ్డు ఉండడంతో ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారన్నారు. దీంతో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డికి గ్రామ ప్రజలు, భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు తాయన్న, రామన్న, ఈరయ్య గౌడ, చెన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం


అశేష భక్తజనుల మధ్య రథోత్సవం

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని వగరూరు గ్రామంలో శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని స్థానికంగా వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి (చెరువు కట్ట నరసప్ప స్వామి) రథోత్సవాన్ని గ్రామ ప్రజలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మంత్రాలయం దగ్గర ఉన్న తుంగభద్ర నదికి వెళ్లి సోమవారం తుంగాజలాన్ని తీసుకొని వచ్చారు. ఆలయ అర్చకులు ఈ జలంతో ఉదయం నుంచి గ్రామంలోని దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామి రథోత్సవాన్ని ఆలయం ఎదురుగా జెమ్మిచెట్టు దగ్గర ఉన్న బసవన్న కట్ట వద్ద లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆదోని అర్బన్: శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో ఆదోని పట్టణంలోని మహవీర్ కాలనీలోని ఉరుకుంద ఈరన్న, గర్జలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర విశేష పూజలు చేపట్టారు. భక్తులకు ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

బసవేశ్వర స్వామికి విశేష పూజలు

కోసిగి: మండల కేంద్రంలోని బసవన్న కొండపై వెలసిన బసవేశ్వరి స్వామికి శ్రావణమాసం చివరి సోమవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు,ఆకుపూజ ఫల పుష్పాలంకరణలు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం దిగువ ప్రాంతంలోని ఈశ్వర దేవాలయం నుంచి కొండపైకి ఉత్సవమూర్తి ఊరేగింపు నిర్వహించారు. అలాగే కందుకూరు రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


సబ్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మంత్రాలయం : నియోజకవర్గంలోని తుంగభద్ర నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సూచించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్ నుంచి లక్షన్నర క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారని, నదీతీర ప్రాంతాల ప్రజలు ఎవరూ నది వద్దకు వెళ్లవద్దని, ముఖ్యంగా పశువులు కాపరులు, జాలర్లు, నదీతీర పంట పోలాల రైతులు వెళ్లరాదన్నారు. అలాగే జోరుగా వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు దాటే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అధికారులను అప్రమత్తం చేయండి

తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తున్నందున అన్ని శాఖల అధికారులతో మాట్లాడి అప్రమత్తంగా చేయాలని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. అలాగే నదికి నీటిని విడుదల చేయడంతో పాటు దిగువ ప్రాంతంలోని సుకేసుల రిజర్వాయర్ నుంచి కూడా నీటి విడుదల కొనసాగుతోందన్నారు. పుకార్లు నమ్మవద్దని, భయపడాల్సిన పనిలేదన్నారు.

డీఈఓపై విచారణ చేపట్టండి

ఆదోని సెంట్రల్: ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగం చేస్తున్నాడనే ఆరోపణలు వస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్‌పై విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షాబీర్ బాషా కోరారు. . సోమవారం ఏఐవైఎఫ్ కార్యలయంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సమావేశం డివిజన్ కార్యదర్శి దస్తగిరి అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ జిల్లా విద్యాధికారి బాధ్యతలను చేపట్టిన తర్వాత విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తూ వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శేఖర్, సహాయ కార్యదర్శి శివ, ఉపాధ్యక్షులు మోహన్, నాయకులు పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రం తనిఖీ

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం రైతు సేవా కేంద్రాన్ని సోమవారం జిల్లా వ్యవసాయ అధికారిణి పి.ఎల్.వరలక్ష్మి తనిఖీ చేశారు. యూరియా నిల్వలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని పత్తి పంట పొలాలను ఆమె సందర్శించి రైతులకు తగిన సూచనలు, సలహాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆదోని ఏడీఏ బాలవర్ధిరాజు, కర్నూలు టెక్నికల్ వ్యవసాయ అధికారి రాఘవేంద్రరావు, ఆదోని ఏఓ సుధాకర్ తదిరులు పాల్గొన్నారు.

కౌతాళం: కౌతాళంలోని ఆర్బీకేలను, ప్రైవేట్ డీలర్ల షాపులను జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి తనిఖీ చేశారు. రైతులకు యూరియా, ఇతర ఎరువుల కొరత లేకుండా చూస్తామన్నారు. ఏఓ శేషాద్రి ఉన్నారు.

ఆర్టీఈ విద్యార్థుల భవితవ్యం తేల్చండి

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీఈ కింద ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థుల భవితవ్యాన్ని తేల్చాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలను చెల్లించనందున ఆయా విద్యార్థులను తమ పాఠశాలల్లోపై తరగతులకు కొనసాగించబోమని యాజమాన్యాలు చెబుతున్నాయన్నారు. సోమవారం పట్టణంలోని మాచాని సోమప్ప ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి బైఠాయించి నిరసన తెలిపారు. ఆయా సంఘాల నాయకులు శేఖర్ నాయుడు, ఉదయ్, వీరేష్ యాదవ్, మహేంద్ర, ఆఫ్రిది, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఎమ్మిగనూరురూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని రైతులు పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏఓ శివశంకర్ అన్నారు. సోమవారం మండలంలో వర్షానికి తడిసిన పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పత్తి పొలంలో నిలిచిన నీటిని మళ్లించాలని, ఎండగా ఉన్న సమయంలో పోటాషియం నైట్రేట్ 5 గ్రాములు, ఒక లీటరు నీటికి లేదా యూరియా లీటర్ నీటికి కలుపుకొని వారం రోజుల వ్యవధిలో మార్చి మార్చి పిచికారీ చేయాలన్నారు.

గోనెగండ్ల : వర్షాలకు తడిసిన మండల కేంద్రంలో వేరుశనగ, పత్తి తదితర పంటలను ఏఓ హేమలత పరిశీలించారు. రైతులకు సూచనలిచ్చారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

- సూపర్ సిక్స్‌పై టీడీపీ, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల వాగ్వాదం
- చైర్మన్ పోడియం వైపు దూసుకొచ్చిన టీడీపీ సభ్యులు
- ఇరుపక్షాలను వారించిన చైర్మన్ కేఎస్ రఘు


పోడియం వైపు దూసుకొస్తున్న టీడీపీ సభ్యులను వారిస్తున్న మున్సిపల్ చైర్మన్ కేఎస్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ, వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ సభ్యుల మధ్య వాగ్వాదంతో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. మున్సిపల్ సమావేశ భవనంలో సోమవారం చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. కూటమి ప్రభుత్వం అమలు చేసే సూపర్ సిక్స్ పథకాల అమలు బాగుందని టీడీపీ కౌన్సిలర్ రాందాస్ గౌడ్ పేర్కొనడంతో.. చేనేతలకు ఇచ్చిన హామీల అమలెక్కడ చేశారని, నేతన్న నేస్తం ఎక్కడ ఇచ్చారని అంతా మోసం అని, దీనిపై చేనేతలే ప్రశ్నిస్తున్నారని 6వ వార్డు కౌన్సిలర్ శివప్రసాద్ నిలదీయడంతో ఇరు పక్షాల మధ్య వాదోపవాదాలు జరిగాయి.

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల నిరసన

టీడీపీ కౌన్సిలర్లు చైర్మన్ పోడియం వైపు దూసుకొని రావడంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు చైర్మన్ పోడియం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని వార్డుల్లో సమస్యలపై చర్చించాల్సింది పోయి సూపర్ సిక్స్‌పై ప్రసంగాలేమిటని.. అందుకే ఆయా పథకాలెక్కడ అమలు చేస్తున్నారని తాము ప్రశ్నించాల్సి వచ్చిందని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు శివప్రసాద్, బజారి, డిష్ కేశవరెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, కోఆప్షన్ మెంబర్ అబ్రార్ తదితరులు వెల్లడించారు. సభ్యుల వాదనలపై అసహనం వ్యక్తం చేస్తూ ఇరు పక్షాలను చైర్మన్ తన కుర్చి నుంచి లేచి వచ్చి గట్టిగా వారించారు. దీంతో ఇరుపక్షాలు శాంతించాయి. అంతకుముందు కౌన్సిల్ అజెండాలోని 23 అంశాలను ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు.

హసన్‌బేగ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

పట్టణ అభివృద్ధిలో భాగంగా అప్పట్లో మున్సిపల్ కార్యాలయం, మార్కెట్, పలు ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు స్థలాలకు విరాళగా ఇచ్చిన దాత హసన్‌బేగ్ విగ్రహాన్ని గోనెగండ్ల బైపాస్‌లోని సర్కిల్‌లో ఏర్పాటు చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, కౌన్సిలర్ ఖాశింబేగ్‌లతో పాటు పలువురు కౌన్సిలర్లు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే మున్సిపల్ కార్యాలయ సమీపంలోని క్లబ్ ఎదురుగా బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో స్పందించిన కమిషనర్ గంగిరెడ్డి సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి రూ.5.66కోట్ల బిల్లులు కాంట్రాక్టర్లకు రావాల్సి వుందని వాటిని సత్వరం మంజూరు చేస్తే కొత్త పనులు చేపడతారని వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ కౌన్సిల్ దృష్టికి తీసుకొని రాగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీ ఫ్లోర్‌లీడర్‌గా నియామకమైన రాందాస్‌గౌడ్‌ను సభ్యులు సత్కరించారు. సమావేశంలో డీఈలు నీరజ, రాజునాయక్, ఏఈలు మదన్, శరత్, ఆర్ఓ అస్లాంబాషా, టీపీఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత రాజకీయాలు మానుకోవాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి

మంత్రాలయం రూరల్ : టీడీపీ నాయకులు మోసపూరిత రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ రెడ్డి హితవుపలికారు. సోమవారం వగరూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..రైతులు యూరియా కోసం వెళ్లితే టీడీపీ కండువాలు కప్పి.. సిగ్గు లేకుండా 30 కుటుంబాలు పార్టీలో చేరాయని చెప్పడం సిగ్గు చేటన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. మేమంతా వైఎస్సార్‌సీపీ పార్టీలో ఉంటూ, ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి వెంటే నడుస్తామని వివరించారు. వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గజ్జల గుర్రం నాగరాజు, ఉప్పలప్ప, బుడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు నదివైపు వెళ్లొద్దు

నందవరం : తుంగభద్ర నది ఉధృతంగా ప్రవాహిస్తుడడంతో నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది వైపు వెళ్లరాదని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండలంలోని నాగలదిన్నె గ్రామంలోని బ్రిడ్జి వద్ద తుంగభద్ర నదిని పరిశీలించారు. నాగలదిన్నె, గురజాల, నదికైరవాడి, గంగవరం, పెద్దకొత్తిలి తదితర గ్రామాల్లో రెవెన్యూ అధికారులు చేత దండోరా వేయించారు. రైతులు, జాలర్లు, పశువుల కాపులు, బట్టలు ఉతికేందుకు మహిళలు నది వద్దకు వెళ్లవద్దని సూచించారు.

